

ఉపాధ్యాయులు కావాలి

- ఐదు తరగతులకు ఇద్దరు ఉపాధ్యాయులా..?
- పాఠశాల గేటుకు తాళం వేసి విద్యార్థుల ధర్నా
- ఎంఈవో హామీతో విరమణ



ఆరగిద్ద పాఠశాల ముందు ధర్నా చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

గట్టు, సెప్టెంబరు 23 : ఉపాధ్యాయులు కావాలని సోమవారం జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండలంలోని ఆరగిద్ద గ్రామ పాఠశాల ముందు విద్యార్థులు ధర్నా చేశారు. విద్యార్థుల సంఖ్యకు సరిపడా ఉపాధ్యాయులు లేక పోవడంతో తమ చదువులు సాగడం లేదని పాఠశాల గేటుకు తాళం వేసి ధర్నా చేశారు. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు ఉన్న తమ పాఠశాలలో మొత్తం 311 మంది విద్యార్థులు ఉంటే కేవలం ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. తరగతికి ఒక్కరి చొప్పున కూడా ఉపాధ్యాయులు లేకపోతే ఎలా చదువుకోవాలని, తమకు పూర్తిస్థాయి ఉపాధ్యాయులను కేటాయించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ధర్నాకు పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హలీంపాషా మద్దతు తెలిపారు. ధర్నా విషయాన్ని విద్యాధికారి నరసింహకు ఫోన్లో వివరించారు. దసరా సెలవుల తర్వాత నలుగురు విద్యావలంటర్లను నియమిస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు తమ ఆందోళనను విరమించారు. ఇచ్చిన హామీ అమలు చేయకపోతే ఎంఈవో కార్యాలయాన్ని ముట్టడిస్తామని గ్రామస్థులు, విద్యార్థుల తల్లి తండ్రులు హెచ్చరించారు.

బడులకు నిధులు

- ఉమ్మడి జిల్లాలో 3,032 పాఠశాలలు - రూ.6,18,30,000 మంజూరు

జిల్లాలు	పాఠశాలసంఖ్య	మొత్తం నిధులు (స్కూల్,స్పోర్ట్స్)	మంజూరైన 50 శాతం నిధులు
నారాయణపేట	460	2,10,20,000	1,05,10,000
మహబూబ్‌నగర్	795	3,03,85,000	1,51,92,500
గద్వాల	447	2,19,60,000	1,09,80,000
నాగర్‌కర్నూల్	834	3,03,85,000	1,51,92,500
వనపర్తి	496	1,99,10,000	99,55,000
మొత్తం	3,032	12,36,60,000	6,18,30,000



కొల్లంపల్లి పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలు తెలుసుకుంటున్న కలెక్టర్ సిక్తాపట్నాయక్ (ఫైల్)

నారాయణపేట, సెప్టెంబరు 23: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు, లోకల్‌బాడీ, కేజీబీవీలకు నిధులు విడుదల చేశారు. ఉమ్మడి జిల్లాలో 3,032 పాఠశాలలకు రూ.6,18,30,000 నిధులు మంజూరయ్యాయి. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా విద్యాశాఖ నిధులు మంజూరు చేసింది. విద్యార్థుల సంఖ్య ఒకటి నుంచి 30 వరకు ఉంటే రూ.10వేలు, 31-100 వరకు ఉంటే రూ.25 వేలు, 101-250 వరకు ఉంటే రూ.50 వేలు, 251 నుంచి పైబడి ఉంటే రూ.75వేల వరకు ఖర్చుల కింద చెల్లించనున్నది. ఈ నిధులను అమ్మ ఆదర్శపాఠశాల కమిటీల తీర్మానం మేరకు రిజిస్టర్లు, హాజరు పట్టికలు, సుద్దముక్కలు, పరీక్షల నిర్వహణ, కంప్యూటర్ సామగ్రి, మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్వహణ, తాగునీరు, జాతీయ పండుగల నిర్వహన తదితర అవసరాలకు వినియోగించాల్సి ఉంటుంది. ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా పరికరాలు కొనుగోలుకు ఈ విద్యాసంవత్సరంలో ప్రత్యేక నిధులు మంజూరు అయ్యాయి. ఆటలు, వ్యాయమానికి అవసరమైన పరికరాలు కొనేందుకు ధరలు నిర్ణయిస్తూ ఆదేశాలు జారీ చేసింది. గతంలో నాసిరకం పరికరాలు, ఆట వస్తువులు కొనుగోలు చేయడంతో ఈ ఏడాది సమగ్రశిక్ష అధికారులే ఈ నిధులతో కొనాల్సిన పరికరాల ధరలను నిర్ణయించింది. ప్రాథమిక పాఠశాలలకు రూ.5వేలు, పాఠమికోన్నత పాఠశాలలకు రూ.10 వేలు, ఉన్నత పాఠశాలలకు రూ.25 వేలు అందిస్తుండగా ప్రస్తుతం 50 శాతం నిధులు మంజూరయ్యాయి.

రోడ్డు ప్రమాదంలో తల్లీకూతుళ్ల మృతి



స్వాతి (ఫైల్)



అశ్విత (ఫైల్)

శ్రీరంగాపురం, సెప్టెంబరు 23: రోడ్డు ప్రమాదంలో తల్లీకూతుళ్లు మృతి చెందిన ఘటన సోమవారం వనపర్తి జిల్లా శ్రీరంగాపురం మండల కేంద్రం సమీపంలో జరిగింది. నాగరాల ఒకటో పునరావాస కేంద్రానికి చెందిన పురేందర్ తమ గ్రామం నుంచి భార్య స్వాతి (26), కూతురు అశ్విత (3)తో కలిసి శ్రీరంగాపురం వైపు బయలుదేరాడు. శ్రీరంగాపురం సమీపంలోని పృథ్వీరాజు వ్యవసాయ క్షేత్రం దగ్గర బుసిరెడ్డిపల్లి గ్రామం నుంచి శ్రీరంగాపురం వెళుతున్న ఓ మినీ డీసీఎం వెనుక నుంచి వస్తున్న బైక్‌కు దారి ఇచ్చి మళ్లీ రోడ్డుపైకి వచ్చింది. ఈ సందర్భంగా డీసీఎంకు తగిలించిన మిల్లర్ ప్రమాదవశాత్తు బైక్‌పైకి ఎక్కింది. దీంతో పురేందర్ భార్య, కూతురు అక్కడికక్కడే మృతి చెందారు. పురేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. దీంతో నాగరాల గ్రామంలో విషాదం నెలకొన్నది.

పాముకాటుతో బాలుడి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం, సెప్టెంబరు 23 : పాముకాటుతో బాలుడు మృతి చెందినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ సోమవారం తెలిపారు. నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ పరిధిలోని నెల్లికొండకు చెందిన మణికంఠ (6) 20వ తేదీ రోజు రాత్రి ఇంట్లో పడుకున్న చోట పాము కాటువేసింది. దీంతో కుటుంబ సభ్యులు జిల్లా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. తండ్రి శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నోరూరించే.. సీతాఫలం



- నల్లమల సీతాఫలానికి భలే డిమాండ్
- ఉపాధి పొందుతున్న గిరిజనులు, గిరిజనేతరులు



సీతాఫలాలను విక్రయానికి ట్రాక్టర్‌లో తరలిస్తున్న గిరిజనులు

కొల్లాపూర్, సెప్టెంబరు 23: నల్లమల అడవిలో లభించే సీతాఫలం ఎంతోమంది నిరుపేదలకు ఉపాధి చూపుతోంది. శీతాకాలం ప్రారంభం నుంచే నాగర్‌కర్నూల్ జిల్లాలోని నల్లమలలో అడవిలో ప్రకృతి సిద్ధంగా లభించే సీతాఫలం ఎంతో తీపి కలిగి ఉంటుంది. కొల్లాపూర్ మండలంలోని ముక్కిడిగుండం గేమ్యానాయక్ తండా, మొలచింతలపల్లి, సోమశిల, అమరగిరి, నార్లాపూర్ నల్లమల్ల అడవుల్లో కృష్ణానది పరివాహక ప్రాంతాలతో పాటు పెద్దకొత్తపల్లి మండలం సాతాపూర్ అడవుల్లో లభించే సీతాఫలాలను గిరిజనులు గిరిజనేతరులు సేకరించి కొల్లాపూర్, పెద్దకొత్తపల్లి, నాగర్‌కర్నూల్ ప్రాంతాల్లో ఉన్న మార్కెట్లో విక్రయిస్తు ఉపాధి పొందుతున్నారు. కాయ సైజును బట్టి ధర నిర్ణయించి మార్కెట్లో బాక్సుకు రూ. 200 నుంచి రూ.400, రూ.500 వరకు విక్రయిస్తున్నారు. కొల్లాపూర్ సీతాఫలానికి బహిరంగ మార్కెట్‌లో భలే డిమాండ్ ఉంది. ఇక్కడి నుంచి ప్రతీ రోజు హైదరాబాద్, కర్నూల్, నంద్యాల, గుంటూరు మార్కెట్‌కు తరలిస్తుంటారు. నేరుగా ఆ ప్రాంత వ్యాపారులే వచ్చి ఇక్కడ కొనుగోలు చేసి తీసుకెళ్తుంటారు. కొంతమంది గిరిజనులే స్వయంగా వెళ్లి బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తు ఉపాధి పొందుతున్నారు. ఎండాకాలంలో ఈ ప్రాంత మామిడికి ఎంత డిమాండ్ ఉంటుందో... శీతాకాలంలో ఈ సీతాఫలాలకు కూడా అదే రీతిలో డిమాండ్ ఉంటుంది. దీంతో చాలామంది అడవిలో సీతాఫలాల సేకరణకు వెళ్తుంటారు. ఈ రెండు నెలల పాటు వారంతా మిగతా కూలీ పనులకు వెళ్లకుండా నల్లమలలో సీతాఫలాలు సేకరించి ఉపాధి పొందుతుంటారు.



మార్కెట్‌కు తరలించేందుకు బాక్సుల్లో నింపి ఉంచిన సీతాఫలాలు



విక్రయానికి బుట్టలో ఉంచిన సీతాఫలాలు



బాక్సుల్లో నింపడానికి సిద్ధం చేసిన సీతాఫలాలు



పావురాన్ని ఎగురవేసి క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి జూపల్లి

క్రీడల్లో రాణిస్తే జాతీయ స్థాయి గుర్తింపు

- ఎస్‌జీఎఫ్ఐ 68వ డివిజన్ స్థాయి క్రీడాపోటీలను ప్రారంభించిన మంత్రి జూపల్లి



విద్యార్థులతో కబడ్డీ ఆడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్, సెప్టెంబరు 23 : విద్యార్థులు, యువత క్రీడల్లో రాణిస్తే జాతీయ స్థాయి గుర్తింపు పొందుతారని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సోమవారం కొల్లాపూర్ పట్టణంలోని మినీ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ఐ 68వ డివిజన్ స్థాయి క్రీడలను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. క్రీడాకారులు మంత్రి జూపల్లికి గౌరవ వందనం చేసిన అనంతరం మంత్రి జూపల్లి క్రీడా జ్యోతితో గ్రౌండ్ చుట్టు పరుగు తీసి విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపారు. అనంతరం విద్యార్థులనుద్దేశించి మంత్రి మాట్లాడుతూ అండర్-17, 14 బాలబాలికలకు డివిజన్ స్థాయి క్రీడల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడం హర్షించదగ్గ విషయమన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు నేర్చుకోవాలని తెలిపారు. విద్యార్థులు పుస్తకాలు చదువుతూ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలల్లో డివిజన్ స్థాయి ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. పాఠశాల విద్యార్థులతో కలిసి మంత్రి జూపల్లి కబడ్డీ ఆడారు. అంతకు ముందు మినీ స్టేడియం ఆవరణలోనే శాంతికపోతాలను ఎగిరేసి డివిజన్ ఎస్‌జీఎఫ్ఐ జెండాను ఆవిష్కరించారు. డివిజన్ స్థాయి క్రీడా పోటీలు సాయంత్రం వరకు కొనసాగాయి. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారని వ్యాయామ ఉపాధ్యాయులు పేర్కొన్నారు. కార్యక్రమంలో కొల్లాపూర్ మునిసిపల్ చైర్మన్ మేకల రమ్యా, వైస్ చైర్మన్ మహెముదాబేగం, కౌన్సిలర్లు ఎస్.నరసింహారావు, షేక్.రహీంపాషా, ఎండీ నయీమ్, పిన్నంశెట్టి జ్యోతిశేఖర్, కర్నె ఆలివేలు, మేకల శిరీష, బొరెల్లికరుణమ్మ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మంత్రి జూపల్లి కృష్ణారావుకు గౌరవ వందనం చేస్తున్న విద్యార్థినులు

24 గంటల్లో.. 41 కాన్పులు

- పాలమూరు జనరల్ ఆసుపత్రిలో పెరుగుతున్న డెలివరీలు

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం) సెప్టెంబరు 23: ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని మాతాశిశు విభాగంలో 24 గంటల్లో 41 కాన్పులు చేసి రికార్డు సృష్టించారు. ప్రైవేటు ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ అస్పత్రుల్లో వైద్యసేవలందుతున్నాయనేందుకు ఇదో ఉదాహరణ. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని మాతాశిశు ఈ విభాగానికి ప్రతీరోజు దాదాపు 600 నుంచి 800 మంది వరకు గర్భిణులు ఓపీ కోసం వస్తుంటారు. ఈ విభాగం నిత్యం గర్భిణులతో కిటకిటలాడుతోంది. రోజు 30 నుంచి 35 వరకు కాన్పులు చేస్తుంటారు. కానీ ఈనెల 19వ తేదీ శుక్రవారం ఒక్కరోజే 41 కాన్పులు చేసి రికార్డు సృష్టించారు. గతంలో ఒకేరోజు 43 కాన్పులు చేశారు. ప్రస్తుతం మొత్తం 41 కాన్పులు చేయగా 42 మంది శిశువులు జన్మించారు. ఒకరు కవలలకు జన్మనిచ్చారు. మొత్తం కాన్పుల్లో 16 మంది మగ, 26 మంది ఆడ శిశువులు ఉన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ సంపత్‌కుమార్ సింగ్ ఎంసీహెచ్ డాక్టర్లను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వచ్చినవన్నీ హైరిస్కు కేసులేనని, ఎంతో శ్రమించి ఒకేరోజు ఇన్ని కాన్పులు చేయడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో పనిచేసి ఆసుపత్రికి మంచి పేరు తేవాలని, పేదలకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో గైనిక్ విభాగాధిపతి డాక్టర్ సంగీతషా, అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ లక్ష్మీపద్మప్రియ, డాక్టర్ స్ఫూర్తిరెడ్డి, డాక్టర్ ఆశాజ్యోతి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ అర్చన, డాక్టర్ సోఫియా, డాక్టర్ రూహి, డాక్టర్ షాహనాజ్, డాక్టర్ మమత, సీనియర్ రెసిడెంట్ డాక్టర్లు, పీజీ డాక్టర్లు, అనెస్టీషియా విభాగం డాక్టర్లు, సిబ్బంది, ఆర్‌ఎంవోలు డాక్టర్ జరీనా, డాక్టర్ దుర్గ, డాక్టర్ గణేష్, డాక్టర్ ఈసిస్‌లు పాల్గొన్నారు.



నవజాత శిశువులతో సూపరింటెండెంట్, వైద్యులు, సిబ్బంది

మళ్లీ వానలు షురూ..

మహబూబ్‌నగర్/నాగర్‌కర్నూల్ టౌన్, సెప్టెంబరు 23 : రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ చెప్పినట్లుగా సోమవారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని పలుచోట్ల వర్షం కురిసింది. ఉదయం ఆరు గంటలకు అరగంట పాటు కుండపోతలా వాన కురవగా, సాయంత్రం ఐదు గంటలకు మళ్లీ వాన కురిసింది. ఇప్పటికే భారీ వర్షాలతో జిల్లాల్లోని చెరువులన్నీ నిండుకుండలా మారి అలుగులు పారుతుండగా సోమవారం కురిసిన మోస్తరు నుంచి భారీ వర్షంతో పలు మండలాల్లో చెరువులు, కుంటలు అలుగులు పారుతున్నాయి.

నాగర్‌కర్నూల్ జిల్లాలో ఆదివారం ఉదయం నుంచి సోమవారం తెల్లవారు జాము వరకు సగటు వర్షపాతం 11.5 మిల్లీమీటర్లు నమోదు కాగా అత్యధికంగా తాడూరు మండలంలో 43.0 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. తెల్కపల్లిలో 28.8, మహబూబ్‌నగర్ అర్బన్‌లో ఉదయం 27 మి.మీ. వర్షపాతం నమోదు కాగా, కోడేరులో 23.6, నాగర్‌కర్నూల్‌లో 20.2, కొల్లాపూర్‌లో 20.0, పెంట్లవెల్లిలో 19.8, వర్షపాతం నమోదైంది.



సోమవారం ఉదయం కురిసిన వర్షానికి భూత్పూర్ చౌరస్తాలో నిలిచిన నీరు

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని వ్యక్తి ఆత్మహత్య

గోపాల్‌పేట, సెప్టెంబరు 23 : మద్యం తాగేందుకు భార్య డబ్బులు ఇవ్వలేదని భర్త చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలంలోని జయన్న తిరుమలపూర్ చెందిన మహేష్ గౌడ్ (36) డ్రైవర్ పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఆదివారం సాయంత్రం మద్యానికి భార్య నాగలక్ష్మితో డబ్బులు ఇవ్వాలని గొడవ పడ్డాడు. ఆమె డబ్బులు లేవని చెప్పడంతో మహేష్ ఆవేశంతో వెళ్లి గ్రామ సమీపంలో ఉన్న చెరువులో దూకాడు. మహేష్ తమ్ముడు నరేష్‌కు విషయం తెలియడంతో తన వదినకు ఫోన్ చేసి సమచారం ఇచ్చాడు. కుటుంబసభ్యులు గ్రామస్థుల సహకారంతో చెరువులో వెతికించినా ఎలాంటి ఆచూకీ లభించలేదు. గజ ఈతగాళ్లను పిలిపించి వెతకగా మహేష్ మృతదేహం లభించింది. సోమవారం భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. బాధిత కుటుంబాన్ని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి పరమర్శించారు.

దంపతుల ఆత్మహత్యాయత్నం

- ఫొటోలు తీసి అవమానకరంగా బెదిరించిన పోలీసులు
- ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన - సోషల్ మీడియాలో వైరల్

నాగర్‌కర్నూల్ క్రైం, సెప్టెంబరు 23 : అవమానం భరించలేక దంపతులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలో చోటుచేసుకున్నది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు మే 16వ తేదీన ఒక యువకుడు తన స్నేహితురాలితో నాగర్‌కర్నూల్ పట్టణంలోని నల్లవెల్లి రోడ్డులో కారులో భోజనం చేస్తుండగా 100డయల్ పోలీసులు తమ ట్యాబ్‌లో వారి ఫొటోలు చిత్రీకరించి మీరు ఇక్కడ ఏం చేస్తున్నారంటూ బెదిరించారు. వారి వద్ద రూ.10వేలు డిమాండ్ చేశారు. రూ.10వేలు లేక పోవడంతో ఉన్న రెండు వేల రూపాయలను సదరు కానిస్టేబుల్ తన స్నేహితుడి ఫోన్‌పేకు వేయించుకున్నాడు. అంతటితో ఆగకుండా మళ్లీ ఇటీవల డబ్బులు డిమాండ్ చేశాడు. లేదంటే మీ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ చేస్తామని బెదిరించాడు. బాధితుడు బెదరకపోవడంతో ఫొటోలు బాధితుడి భార్యకు, బంధువులకు చూపించే ప్రయత్నం చేశారు. దీంతో ఆ కుటుంబంలో కలహాలు ఏర్పడి భార్య పురుగుల మందు తాగింది. భర్త ఉరి పెట్టుకుని ఆత్మహత్యకు యత్నించాడు. దీంతో వారి బంధువులు ఇద్దరి ప్రాణాలను రక్షించి జరిగిన సంఘటన వివరాలు తెలుసుకున్నారు. ఈ విషయం బయటకు పొక్కడంతో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ప్రజలకు రక్షణ కోసం పని చేస్తున్న పోలీసులే డబ్బుల కోసం కుటుంబాల్లో చిచ్చుపెట్టి ప్రాణాలకు ముప్పు వాటిల్లే విధంగా వ్యవహరించడం ఎంత వరకు సమంజసమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఏదేమైనా ఉన్నతాధికారులు విచారణ జరిపి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఆరోపణలు రుజువైతే చర్యలు

గస్తీ తిరిగే పోలీసులు ఫొటోలు తీసి డబ్బుల కోసం డిమాండ్ చేసిన సంఘటన సోషల్ మీడియాలో వైరల్ అయిన సంఘటనపై విచారణ జరిపి బాధ్యులపై కఠినమైన చర్యలు తీసుకుంటామని సీఐ పేర్కొన్నారు.

బాలిక మృతికి కారణమైన నిందితులను కఠినంగా శిక్షించాలి

- ఐద్వా జిల్లా అధ్యక్షురాలు గద్వాల సాయిలీల



నిరసన తెలుపుతున్న ఐద్వా సభ్యులు

వనపర్తి టౌన్, సెప్టెంబరు 23 : లైంగిక వేధింపులు తట్టుకోలేక బాలిక ఆత్మహత్యకు కారకులైన నిందితులకు కఠినంగా శిక్షించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా అధ్యక్షురాలు గద్వాల సాయిలీల డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని భగత్‌సింగ్ నగర్ కాలనీలో నిరసన తెలిపారు. గద్వాల జిల్లాలో పదో తరగతి చదివే బాలిక ఐదు రోజుల కిందట పురుగుల మందు తాగిందని, గమనించిన తల్లిదండ్రులు ఆసుపత్రికి తరలించారని తెలిపారు. చికిత్స అందిస్తుండగా రెండు రోజుల తర్వాత స్పృహలోకి వచ్చి తన ఆత్మహత్యాయత్నానికి ముగ్గురే కారణమని, బాలిక వెల్లడించినట్లు ఆమె తెలిపారు. వారి వేధింపులు తట్టుకోలేక పురుగుల మం దు తాగినట్లు బాలిక వివరించినట్లు తండ్రి తెలిపాడని, చికిత్స పొంది మూ డు రోజుల తరువాత మృతి చెందిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. బాలిక మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉమా, సుగుణమ్మ, భాగ్య, బాలకిష్టమ్మ, గట్టమ్మ, ప్రసన్న, యాదమ్మ, నారమ్మ, పల్లవి, పావని, దివ్య తదితరులు పాల్గొన్నారు.

చికెన్ వ్యర్థాల వాహనాలు పట్టివేత

ఎర్రవల్లి, సెప్టెంబర్ 23 : ఎర్రవల్లి మండలంలోని తిమ్మాపూరం శివారులో అర్ధరాత్రి అక్రమంగా తరలిస్తున్న చికెన్ వ్యర్థాల రెండు బొలెరో వాహనాలను పట్టుకుని కేసు నామోదు చేసినట్లు ఇటిక్యాల ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. వాహన డ్రైవర్లుగా ఎరుకలి రవి, ఎరుకలి ఎల్లప్పలుగా గుర్తించారు.

శిథిలావస్థకు చేరిన ధ్వజస్తంభం

- 'కురుమూర్తి'లో ఏటా జారుతున్న కొండచరియలు

- ముందస్తు చర్యలు తీసుకోవాలంటున్న భక్తులు



గర్భగుడి సమీపంలో ప్రమాదకరంగా మారిన కొండచరియలు

చిన్నచింతకుంట, సెప్టెంబరు 23 : మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలంలోని కురుమూర్తి వేంకటేశ్వరస్వామి గర్భగుడి ఎదురుగా ఉన్న ధ్వజస్తంభం పూర్తిగా ప్రమాదపు అంచుల్లో ఉంది. కురుస్తున్న వర్షాలకు కొండ చరియలు కొట్టుకుపోవటంతో, ధ్వస్తంభం సమీపంలోని పెద్ద రాతి గుండ్లు జారుతున్నాయని భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యాగశాల మండపాలంకరణ నుంచి నేరుగా చూస్తే ధ్వజస్తంభం ఎంత ప్రమాదంలో ఉందో స్పష్టమవుతుంది. నిత్యం సంబంధిత అధికారులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు స్వామి వారిని దర్శనం చేసుకుని వెళ్తున్నారే తప్పా, ఆలయ ధ్వజస్తంభాన్ని పట్టించుకోవడం లేదని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

దాతలపైనే ఆధారం..

కురుమూర్తిస్వామి ఆలయ అభివృద్ధి విషయంలో దేవాదాయ శాఖ అధికారులు కేవలం దాతలపైనే భారం వేసి వదిలేస్తున్నారు. స్వామి వారి గుట్టమీదకు వెళ్లేందుకు పాత కోనేరు నుంచి రోడ్డు వేసేందుకు కూడా దాతల సహకారం కోసం ఎదు రుచూస్తున్నారే తప్పా, ప్రభు త్వ పరంగా ఎలాంటి చర్యలు తీసుకోవటంలేదని భక్తులు విమర్శిస్తున్నారు. రోడ్డుతో పా టుగా ప్రమాదంలో ఉన్న ధ్వ జస్తంభానికి మందుస్తు జాగ్ర త్తగా రక్షణగోడను ఏర్పాటు చేస్తే ప్రయోజనకరంగా ఉంటుందని భక్తులు కోరుతున్నారు.

ప్రణాళికలు రూపొందించాం

కురుమూర్తిస్వామి ధ్వజస్తంభం సమీపంలోని కొండ చరియలు జారుతుంది వాస్తవమే. దాతల సహకారంతో మహామండపం నిర్మాణం చేపట్టేందుకు ప్రణాళికలను రూపొందించాం. ధ్వజస్తంభాన్ని ఆగమశాస్త్రం ప్రకారం మార్చి, దాదాపు రూ.2కోట్ల వ్యయంతో చేపట్టేలని గతంలో నిర్ణయించి, స్థానిక ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి దృష్టిలో ఉంచాం. రానున్న బ్రహ్మోత్సవాలకు సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానించి, మరిన్ని నిధులు తీసుకొచ్చి అభివృద్ధి పనులు చేపడుతాం.

- మదనేశ్వర్‌రెడ్డి, కురుమూర్తి ఆలయ ఈఓ

హత్య కేసులో నిందితుల అరెస్ట్



వివరాలు తెలియజేస్తున్న జడ్చర్ల రూరల్ సీఐ నాగార్జునగౌడ్

బాలానగర్, సెప్టెంబరు 23: మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలంలో సంపంగి వడ్డె పర్వాతాలు హత్యకు సంబంధించిన నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు సోమవారం తరలించినట్లు జడ్చర్ల రూరల్ సీఐ నాగార్జునగౌడ్ వెల్లడించారు. స్థానిక స్టేషన్‌లో సీఐ మాట్లాడుతూ.. మండలం లోని పెద్దాయపల్లికి చెందిన సంపంగి వడ్డె పర్వతాలు (35) ఈ నెల 18న మండల కేంద్రంలోని పెద్దాయపల్లి చౌరస్తాలోని ఓ వెంచర్‌లో మద్యం తాగేందుకు కుమ్మరి బాలరాజు, బాలకృష్ణ, కిట్టు పిలిచి పథకం ప్రకారం తాగించారు. మైకంలో ఉన్న పర్వతాలును బాలకృష్ణ మెడపై గొడ్డలితో నరికి దారుణంగా హత్య చేశారని దర్యాప్తులో తేలిందని సీఐ వెల్లడించారు. అదే గ్రామానికి చెందిన బాలరాజు, పర్వతాలు భార్య అనసూయలు ప్రధాన కారణమని తెలిపారు. బాలకృష్ణ, మృతుడి భార్య మధ్య గల వివాహేతర సంబంధమే హత్యకు ప్రధాన కారణమని తెలిపారు. వీరిద్దరికి భర్త అడ్డుగా ఉన్నాడని భావించి ఓ పథకం ప్రకారమే ఈ హత్య చేశారని తెలిపారు.

27న ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థి మహాగర్జన

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబరు 23 : విద్యారంగంలో నెలకొ న్న సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 27న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యా మహాగర్జన నిర్వహించనున్నామని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని అక్షర జూనియర్ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో చలో హైదరాబాద్ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను నాయకులు ఆవి ష్కరించారు. కార్యక్రమానికి విద్యార్థులు భారీ సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ప్రశాంత్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు భరత్, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిబ్బంది ఎంపికపై అభ్యంతరాలు తెలపండి

నాగర్‌కర్నూల్ టౌన్, సెప్టెంబరు 23: జిల్లాలోని కేజీబీవీ, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు ఎంపిక చేసిన బోధనా సిబ్బంది జాబితాలో అభ్యంతరాలు ఉంటే ఈ నెల 24 మధ్యాహ్నం 12 గంటలకు కలెక్టరేట్‌లోని జిల్లా విద్యాశాఖ కార్యాలయం లో తెలిపాలని డీఈవో గోవిందరాజులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక చేసిన అభ్యర్థుల జాబితా జిల్లా విద్యాధికారి వెబ్ సైట్‌లో ఉంచామని ఆయన తెలిపారు.

నేడు పీడీఎస్‌యూ స్వర్ణోత్సవ సభ

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబరు 23 : పీడీఎస్‌యూ స్వర్ణో త్సవాల సందర్భంగా జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ సమీపంలో గల విజన్ కన్వెన్షన్ హాల్‌లో మంగళవారం సభ నిర్వహించనున్నట్లు యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీతారాం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఆర్అండ్‌బీ అతిథిగృహం నుంచి విద్యార్థులతో భారీ ప్రదర్శన ఉంటుందని తెలిపారు. రాష్ట్ర నాయకులు హాజరవనున్నట్లు పేర్కొన్నారు.

తాగునీటికి ఎదురుచూపు



ఖాళీ బిందెలతో వరుసలో కూర్చున్న మహిళలు

మక్తల్, సెప్టెంబరు 23 : మక్తల్‌లో మూడు రోజులుగా తాగునీటి ఎద్దడి నెలకొంది. మిషన్ భగీరథ పైపులైన్‌లకు మరమ్మతుల కారణంగా నీటి సరఫరా నిలిపివేశారు. ఈ నేపథ్యంలో తాగునీటి కోసం ప్రజలు బోర్ల వద్దకు వెళ్లి ఎదురు చూస్తున్నారు. కొన్ని కాలనీల్లో మహిళలు బిందెలతో క్యూ కట్టి వేచి ఉంటున్నారు. వేసవిలో రావాల్సిన నీటి ఎద్దడి వర్షాకాలంలో ఏర్పడటం విడ్డూరంగా ఉందని పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోతే ప్రత్యామ్నాయంగా ప్రజలకు నీటిని అందించాలి. కానీ అధికారులు అవేవి పటించుకోవడం లేదు.

గొర్రెల మృతిపై పంచనామా



విచారణ చేస్తున్న ఆర్ఐ తిరుపతయ్య

పెద్దమందడి, సెప్టెంబరు 23 : వనపర్తి జిల్లా పెద్దమందడి మండలంలోని బలిజపల్లిలో ఆదివారం సాయంత్రం పిడుగు పాటుకు గొల్ల శంకర్ గొర్రెలు మృతి చెందాయి. సోమవారం ఆర్ఐ తిరుపతయ్య విచారణ చేపట్టి పంచనామా నిర్వహించారు. నాలుగు గొర్రె పిల్లలు మృతి చెందినట్లు తెలిపారు. నివేదికలను కలెక్టర్‌కు అందజేస్తామని అన్నారు.

వర్షాలకు కూలిన ఇల్లు



జకినాలపల్లిలో కూలిన ఇల్లు

ఊర్కొండ, సెప్టెంబరు 23: వర్షాలకు నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలోని జకినాలపల్లిలో జిలేకాబేగం ఇల్లు సోమవారం కూలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని గ్రామస్థులు తెలిపారు. జిలేకాబేగంకు ఇద్దరు కుమారులు కాగా గతేడాది చిన్న కు మారుడు మృతి చెందాడు. పుట్టెడు దుఃఖంలో ఉన్న ఆమెకు ఇల్లు సైతం కూ లడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని ఆమె కోరారు.

కృష్ణ మండలంలో మరో ఇల్లు..



కృష్ణలో కూలిన మట్టిమిద్దె వద్ద బాధితుడు

కృష్ణ, సెప్టెంబర్ 23 : మట్టిమిద్దె కూలిపోయిన ఘటన నారాయణపేట జిల్లా కృష్ణ మండలంలోని ఆలంపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. ఇంటి పైకప్పు కూలేందుకు సిద్ధంగా ఉన్న విషయం గమనించిన కుటుంబ సభ్యులు ముందుగానే ఖాళీ చేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఇల్లు కూలిపోయిన బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థిక సాయం చేయాలని గ్రామస్థులు కోరారు.

రాష్ట్ర స్థాయిలో విద్యార్థి ప్రతిభ

పెద్దమందడి, సెప్టెంబరు 23 : మండలంలోని మోజర్ల ఉద్యాన కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి అభిలాష్ మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండలో జరిగిన టార్గెట్ బాల్ పోటీలలో ఉమ్మడి జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ జట్టు రాష్ట్ర స్థాయి టార్గెట్ బాల్ 6వ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ ఛాంపియన్ షిప్‌లో ద్వితీయ బహుమతి సాధించాడు. మహబూబ్‌నగర్ జట్టులో ప్రతిభ కనబరిచిన అభిలాష్‌ను వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పిడిగం సైదయ్య అభినందించారు.

సాఫ్ట్‌బాల్ టోర్నీలో రన్నరప్‌గా బాలికల జట్టు



సాఫ్ట్‌బాల్ టోర్నీలో రన్నరప్‌గా నిలిచిన బాలికల జట్టు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, సెప్టెంబర్ 23 : రాజన్న సిరిసిల్లలో సోమవారం రాష్ట్రస్థాయి జూనియర్స్ సాఫ్ట్‌బాల్ టోర్నీలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా బాలికల జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఫైనల్ మ్యాచ్‌లో నిజామాబాద్ జట్టు 4-0తేడాతో మహబూబ్‌నగర్ జట్టుపై విజేతగా నిలువగా, జిల్లా జట్టు రెండోస్థానంలో నిలిచింది. రెండోస్థానంలో నిలవడంపై ప్రతినిధులు రాఘవేందర్, నాగరాజు, కోచ్ సాధిక్‌అలీ అభినందించారు.

రాష్ట్రస్థాయి టార్గెట్‌బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కోయిలకొండ, సెప్టెంబరు 23 : మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండ మండలంలోని పారుపల్లిలోని శ్వేత విద్యామందిర్ పాఠశాల విద్యార్థులు ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి టార్గెట్ బాల్ పోటీల్లో ప్రతిభ చాటి కాంస్య పథకాలు సాధించినట్లు పాఠశాల చైర్మన్ నరేందర్, ప్రిన్సిపాల్ సుహార సోమవారం తెలిపారు. టార్గెట్‌బాల్ రాష్ట్ర టీంలో బాలికల విభాగంలో సుమిత్ర, కేదారేశ్వరి, అశ్విని, నాగలక్ష్మి, నందిని, బాలురలో రామ్‌చరణ్, శివయ్య పాల్గొన్నట్లు తెలిపారు.

కరాటే విద్యార్థికి అభినందన



విద్యార్థిని అభినందిస్తున్న కొత్వాల్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్ సెప్టెంబరు 23: రంగారెడ్డి జిల్లాలో ఆదివారం జరిగిన జాతీయస్థాయి కరాటే టోర్నీలో జిల్లా కేంద్రంలోని కింగ్‌షో టోకాన్ విద్యార్థి ఉజేఫ్‌షరీఫ్ ప్రతిభ చాటి గ్రాండ్ చాంపి యన్‌షిప్ సాధించారు. సోమ వారం జిల్లా కేంద్రంలో రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లాకొత్వాల్ అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఆత్మరక్షణ కోసం మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలని సూచించారు. కరాటే నేర్చుకోవడంతో పాటు గుర్తింపు ఉన్న క్రీడలను ఎంపిక చేసుకొని రాణించాలన్నారు. కార్యక్రమంలో కింగ్‌షోటోకాన్ క్లబ్ ఫౌండర్ జహంగీర్‌పాషఖాద్రీ, వైస్ చైర్మన్ చెన్నవీరయ్య, రఫిక్‌పటేల్, లక్ష్మణ్, రాములు, మాస్టర్ అర్షజమీల్ పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శన తిలకించిన విద్యార్థులు



సీపీఆర్ చేసే విధానాన్ని పరిశీలిస్తున్న పాఠశాల విద్యార్థులు

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం), సెప్టెంబరు 23 : పట్టణంలోని ఎస్వీఎస్ వైద్య కళాశాల, ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన వైద్య విద్య వైజ్ఞానిక ప్రదర్శనకు విశేష స్పందన లభిస్తోంది. ఈనెల 20న ప్రారంభమైన విజ్ఞాన సదస్సు సోమవారం నాల్గవ రోజుకు చేరింది. 3,400 మంది విద్యార్థులు ప్రదర్శనలు తిలకించారు. ఉమ్మడి జిల్లా నుంచి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు తరలివచ్చారు. కళాశాలలోని 25 విభాగాల పరిధిలో 1,200 స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. విద్యార్థుల నుంచి మంచి స్పందన రావడంతో మరో రెండు రోజులు పొడిగిస్తున్నట్లు ఎస్వీఎస్ ఆసుపత్రి రెసిడెంట్ డైరెక్టర్ రాంరెడ్డి తెలిపారు. ఈ అవకాశాన్ని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైతులకు పరిహారం చెక్కుల పంపిణీ



చెక్కు అందజేస్తున్న రేంజ్ అధికారి దేవజ

మన్ననూర్, సెప్టెంబరు 23 : నల్లమల అభయారణ్య ప్రాంతంలో పెద్దపులి దాడిలో మృతి చెందిన ఆవులకు నష్టపరిహారం మంజూరైంది. వటవర్లపల్లికి చెందిన సుగుణమ్మ, పులాయపల్లి పెంటకు చెందిన జగదీష్ ఆవులు అడవిలో మేతకు వెళ్లగా వేర్వేరు ప్రాంతాల్లో పెద్దపులులు దాడి చేసి చంపివేశాయి. వీరికి ఒక్కొక్కరికి రూ.12వేల చొప్పున వైల్డ్ లైఫ్ ద్వారా మంజూరైన చెక్కులను మన్ననూరు డివిజన్ కార్యాలయంలో రేంజ్ అధికారి దేవజ సోమవారం బాధితులకు పంపిణీ చేశారు. అడవిలో పశువులపై పెద్దపులులు దాడి చేస్తే బాధిత రైతులు అటవీ శాఖ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని కోరారు. కార్యక్రమంలో సెక్షన్ అధికారి బాబలి, బీట్ అధికారులు ప్రవీణ్, ఆనంద్ కుమార్ పాల్గొన్నారు.

అధ్వానంగా అమరగిరి రహదారి

- రోడ్డుపై నిరసన తెలిపిన విద్యార్థులు



అమరగిరి రహదారిలో బస్సు ఆపి నిరసన తెలుపుతున్న విద్యార్థులు

కొల్లాపూర్, సెప్టెంబర్ 23: నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలోని అమరగిరి గ్రామ రహదారి అధ్వానంగా తయారైందని గ్రామానికి చెందిన విద్యార్థులు వాపోయారు. సోమవారం రోడ్డుపై బస్సు ఆపి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్షం చినుకు పడితే రహదారి అధ్వానంగా తయారవుతుందని వెంటనే మరమ్మతు చేయాలని డిమాండ్ చేశారు. రోడ్డుకిరువైపులా కంపచెట్లు ఉండడంతో ఆర్టీసీ బస్సు వెళ్లేందుకు చాలా ఇబ్బందికరంగా ఉందన్నారు. గ్రామస్తులు అనారోగ్యంతో ఆసుపత్రికి వెళ్లేందుకు ప్రయాణం చాలా ఇబ్బందికరంగా ఉంటుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక మంత్రి జూపల్లికృష్ణారావు స్పందించి రోడ్డు మంజూరు చేయాలని కోరారు.

అపర భద్రాద్రికి ఆదరణ కరువు

- సిర్సనగండ్ల ఆలయ అభివృద్ధిపై సీఎం దృష్టి సారించాలని డిమాండ్
- అభివృద్ధితో పాటు పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని కోరుతున్న భక్తులు



సిర్సనగండ్ల సీతారామచంద్రస్వామి ఆలయం వ్యూ..

చారకొండ, సెప్టెంబరు 23 : రాష్ట్రంలోనే రెండవ అపర భద్రాద్రిగా పేరు గాంచిన సిర్సనగండ్ల సీతారామచంద్రస్వామి ఆలయం అభివృద్ధికి ఆమడదూరంలో ఉంది. నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలం సిర్సనగండ్ల పంచాయతీలోని అయోధ్యనగర్ (గుట్ట)లో సుమారు 50 ఎకరాలకు పైగా ఉన్న ఏకశిలపై 500 ఏళ్ల క్రితమే ఆలయంలో సీతారామచంద్రస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించినట్లు పురాణాల ద్వారా తెలుస్తుంది.

ఏటా శ్రీరామనవమికి బ్రహ్మోత్సవాలు

ఏటా శ్రీరామనవమిని పురస్కరించుకొని దేవదాయశాఖ, పొందరి ట్రస్ట్ ఆధ్వర్యంలో పక్షం రోజుల పాటు బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తారు. ఉమ్మడి జిల్లాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చి దర్శించుకొని మొక్కులు తీర్చుకొంటారు.

1,400 ఎకరాల సాగుభూమి

ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల్లో సిర్సనగండ్ల సీతారామచంద్రస్వామికి 1,400 ఎకరాల సాగుభూమి ఉన్నా ఆలయం మాత్రం అభివృద్ధికి నోచుకోవడం లేదు. వందల ఏళ్ల నుంచి భూములను సాగు చేసుకొంటున్న వారు ఎలాంటి కౌలు కట్టక పోవడంతో ఆదాయం రావడం లేదు. ఆలయ భూమి వివరాలు ఇలా ఉన్నాయి.. 56.37 ఎకరాలు స్వామి వారి దేవాలయం, దిగువన జాతర స్థలం 16.24, దేవాలయానికి సమీపంలో 1,062.24, కమాల్‌పూర్ తండాలో 361.07, గోకారంలో 9, వంగూరు మండలం మిట్టసదగోడులో 1.18, డించిచింతపల్లిలో 2.04, రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం కలకొండలో 9.03, కల్వకుర్తి మండలం మార్చాల పంచాయతీలోని యంగంపల్లిలో 16.29, మిడ్జిల్ మండలం గుడిగానిపల్లిలో 2.18, నల్లగొండ జిల్లా డిండి మండలం చెర్కుపల్లిలో 15, తిమ్మాపూర్‌లో 13 ఎకరాల భూములున్నాయి.



స్వామివారి మూల విరాట్

సీఎం దృష్టి సారిస్తే..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉమ్మడి మండలంలోని సిర్సనగండ్ల సీతారామచంద్రస్వామి ఆలయ అభివృద్ధిపై దృష్టి సారిస్తే బావుంటుందని భక్తులు కోరుతున్నారు. ఈ పుణ్యక్షేత్రం ఎన్ని ప్రభుత్వాలు మారిన అభివృద్ధికి నోచుకోక నేడు ఆదరణ కోల్పోతుందని భక్తులు అంటున్నారు. శ్రీరామనవమి సందర్భంగా నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో తప్ప మిగత సమయాల్లో ఎవరూ రావడం లేదని వాపోతున్నారు.

ప్రభుత్వం దృష్టి సారించాలి



పుణ్యక్షేత్రం నేడు ఆదరణ కోల్పోతుంది. గతంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంత్రులు, ఎమ్మెల్యేలు వస్తే ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని హామీలు ఇచ్చినా నేటికీ పట్టించుకోలేదు. సీఎం దేవాలయంపై దృష్టి సారించి అన్ని విధాలుగా అభివృద్ధి చేపట్టాలి.

- చిలివేరు సత్యం, భక్తుడు, చారకొండ

పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి



స్వామి వారికి కల్యాణ మంటపం, ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం 50 గదుల నిర్మాణం, 50 మరుగుదొడ్లు, స్నానాలు చేయడానికి కోనేరు, గుట్ట పైకి స్వామి వారిని దర్శనం చేసుకోవడానికి వాహనాల రాకపోకలకు రెండు లైన్ల రోడ్డు, లైట్లు, పార్కు, అన్నదానసత్రం, మినీ రిజర్వాయర్‌తో పాటు పర్యాటక కేంద్రంగా ఆలయాన్ని తీర్చి దిద్దాలి.

-డేరం లక్ష్మణశర్మ, పూజారి

భూములు అన్యాక్రాంతం



దేవాలయానికి 1,400 ఎకరాలకు పైగా భూములుండగా, అవి అన్యాక్రాంతమవుతున్నాయి. భూములు సాగు చేస్తున్న రైతులు ఎలాంటి కౌలు కట్టడం లేదు. అభివృద్ధి గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ ప్రాంతానికి చెందిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కోరుతున్నాం.

- డేరం రామశర్మ, చైర్మన్, సిర్సనగండ్ల ఆలయం

చిక్కినట్టే చిక్కి.. పారిపోయిన దొంగలు

- భూత్పూర్ బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో చోరీకి యత్నం
- పోలీసులు రావడంతో కట్టర్లు వదిలి.. కారులో పారిపోయిన వైనం

భూత్పూర్, సెప్టెంబరు 23: మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మునిసిపాలిటీ కేంద్రంలోని చౌరస్తా సమీపంలో బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో ఆదివారం రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. పోలీసులకు చిక్కినట్లే చిక్కి వాహనాల్లో పారిపోయారు. బీఎస్ఎన్ఎల్ కార్యాలయ ఉద్యోగులు తెలిపిన వివరాల ప్రకారం.. కార్యాలయంలో కాపర్ కేబుల్‌లు ఉండగా, గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి కార్యాలయంలోని తూర్పు గేటు వద్ద తాళం విరగొట్టి లోపలికి వచ్చారు. కాపర్ వైర్లను కత్తిరించడానికి కట్టర్ల ద్వారా ప్రయత్నిస్తుండగా నైట్ వాచ్‌మన్ చాంద్‌పాషా గమనించాడు. విషయాన్ని కార్యాలయ ఉద్యోగులకు సమాచారం ఇచ్చాడు. వెంటనే పోలీసులకు చెప్పడంతో వారు ఘటనా స్థలానికి చేరుకున్న విషయాన్ని దొంగలు గమనించి వారు తెచ్చుకున్న వాహనాల్లో పారి పోయారు. దొంగలను పట్టుకోవడానికి ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. బీఎస్ఎన్ఎల్ ఉన్నతతాధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుగా ఎస్ఐ తెలిపారు.



కత్తిరించి వదిలేసిన కాపర్ కేబుల్

సకాలంలో పింఛన్లు ఇవ్వాలని రోడ్డెక్కిన వృద్ధులు

ఆత్మకూరు, సెప్టెంబరు 23 : ప్రతి నెల ఐదో తేదీన ఇవ్వాల్సిన పింఛన్ 25వ తేదీ అయిన ఇవ్వడం లేదని వనపర్తి జిల్లా ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని వృద్ధులు గాంధీ చౌరస్తాలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు లక్ష్మీనారాయణశెట్టి, మోష హాజరై వారికి మద్దతు తెలిపి మాట్లాడారు. జూలై పింఛన్లు ఆగస్టు చివరి వారం గడుస్తున్న ఇవ్వకపోవడం సరైంది కాదన్నారు. ప్రతి నెల వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి స్త్రీలు ఆసరా పింఛన్లనే జీవనాధారంగా చేసుకుని గడుపుతున్నారన్నారు.

దీనికి తోడు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైతే ప్రతి నెల రూ.4వేలు ఇస్తామని హామీ ఇచ్చి ప్రభుత్వం ఏర్పాటై తొమ్మిది నెలలు గడుస్తున్నా ఇప్పటికీ పింఛన్ పెంచడం లేదన్నారు. ఈ క్రమంలో ఏఎస్ఐ బీచుపల్లి కలగజేసుకుని పింఛన్‌దారులను వారిస్తూ సకాలంలో పింఛన్ ఇచ్చే విధంగా అధికారులతో మాట్లాడుతామని హామీ ఇవ్వడంతో వారు ధర్నా విరమించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్, రవి, వినేష్, రాములు, వృద్ధులు, వితంతువులు పాల్గొన్నారు.



ఆత్మకూరు పట్టణం గాంధీచౌరస్తాలో ధర్నా చేస్తున్న వృద్ధులు

ఉపాధి కోసం చిన్నతరహా పరిశ్రమలు స్థాపించాలి

- దేశంలో పాలమూరు సితాఫలానికు మంచి గుర్తింపు
- జాతీయ పరిశ్రమల అధికారి ఐఎస్‌కే శర్మ

నవాబ్‌పేట, సెప్టెంబరు 23 : గ్రామీణ ప్రాంతాల్లో యువత ప్రభుత్వ ఉద్యోగాలతోపాటు చిన్నతరహా పరిశ్రమల స్థాపనకు కృషి చేయాలని జాతీయ పరిశ్రమల అధికారి ఐఎస్‌కే శర్మ అన్నారు. సోమవారం మహబూబ్‌నగర్ జిల్లాలని నవాబ్‌పేట మండలం పోమాల గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేసిన సీతాఫల్ ప్రాసెసింగ్ యూనిట్‌ను జిల్లా ఉద్యానవన అధికారి మధుసూదన్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాలమూరు జిల్లా సీతాఫలానికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు. సీతాఫలం ఔషదాలలో విరివిగా వాడతారని తెలిపారు. కార్యక్రమంలో వినోద్‌రావ్, గజేందర్ గౌడ్, రాంరెడ్డి, నరేందర్‌రెడ్డి, జెట్టిరాములు తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జాతీయ పరిశ్రమల అధికారి ఐఎస్‌కే శర్మ

రెండు బైకులు ఢీ: ఇద్దరికి గాయాలు

మిడ్జిల్, సెప్టెంబరు 23 : మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలంలోని రాణిపేట శివారులోని కల్వర్టు వద్ద రెండు బైకులు ఢీకొని, ఇద్దరుకి గాయలైనట్లు సోమవారం స్థానికులు తెలిపారు. చిలువేరు చెందిన మల్లయ్య, రాణిపేట చెందిన జగన్ బంగారు మైసమ్మ ఆలయం నుంచి బైక్‌పై రాణిపేటకు వస్తుండగా మిడ్జిల్ వైపు నుంచి వస్తున్న మరో బైక్ ఢీకొనడంతో మల్లయ్య తలకు బలమైన గాయమైంది. జగన్‌కు కుడి చేయి విరిగినట్లు స్థానికులు తెలిపారు. అంబులెన్స్‌లో గాయపడిన ఇద్దరిని జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అష్టాచమ్మా ఆడుతున్న ఏడుగురిపై కేసు నమోదు

చారకొండ, సెప్టెంబరు 23 : నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలంలోని జూపల్లిలో డబ్బులు పెట్టి అష్టాచమ్మా ఆడుతున్న ఏడుగురిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటరెడ్డి తెలిపారు. పక్కా సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నామని, మంగళవారం కల్వకుర్తి కోర్టులో హాజరుపరుస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అంతర్రాష్ట్ర ప్రాజెక్టుగా 'గట్టు ఎత్తిపోతల'

- మంత్రులను కలిసిన గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల న్యూటౌన్, సెప్టెంబరు 23: అంతర్రాష్ట్ర ప్రాజెక్టుగా గట్టు ఎత్తిపోతలను మార్చి, భవిష్యత్‌లో ఎలాంటి నీటి కొరత లేకుండా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని, కర్ణాటక రాష్ట్ర మంత్రి బోస్‌రాజ్‌లను సోమవారం ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. అంతర్రాష్ట్ర ప్రాజెక్టులపై చర్చించారు. గట్టు ఎత్తిపోతుల ప్రాజెక్టును అంతరాష్ట్ర ప్రాజెక్టుగా మార్చి, భవిష్యత్‌లో నీటికి ఇబ్బంది లేకుండా ప్రణాళికను సిద్ధం చేయడం జరిగిందన్నారు. గద్వాల ప్రాంతంలో ప్రజలకు వేసవి కాలంలో కూడా రెండు పంటలకు సాగునీరు అందించే విధంగా కృషి చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ముందు చూపుతో ఆలోచించి తెలంగాణ, కర్ణాటక రాష్ట్రం ప్రజల మేలు కోసం రాష్ట్ర మంత్రి నీటి పారుదల శాఖ అధికారులతో కలిసి చర్చిండం జరిగిందన్నారు. త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఈ ప్రాజెక్టు నిర్మాణానికి కృషి చేస్తామని తెలిపారు. రాష్ట్ర సీఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డిని కూడా కర్ణాటక మంత్రి, గద్వాల ఎమ్మెల్యే కలిసి ప్రాజెక్టుకు విషయాలను చర్చించి త్వరగా సీఎం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. నీటిపారుదల శాఖ మంత్రి త్వరలోనే గద్వాలలో ప్రాజెక్టు నిర్మాణం పనులను సందర్శించడానికి వస్తారని ఎమ్మెల్యే తెలిపారు.



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో చర్చిస్తున్న ఎమ్మెల్యే, కర్ణాటక మంత్రి

పారిశుధ్య కార్మికుడి మృతి



కొడావత్ తొడియ (ఫైల్)

ఖిల్లాఘణపురం, సెప్టెంబరు 23 : వనపర్తి జిల్లా ఖిలాఘణపురం మండలంలోని దొంతికుంట తండా చెందిన పారిశుధ్య కార్మికుడు కొడావత్ తోడియ (57) రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. మృతుని కుమారుడు కొడావత్ కిషన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 19న దొంతికుంట తండాలోని మోడల్ స్కూల్‌లో కొడావత్ తొడియ పని ముగించుకుని తన ద్విచక్రవాహనంపై వస్తుండగా మూలమలుపు వద్ద ప్రమాద వశాత్తు అదుపు తప్పి కిందపడ్డాడు. తలకు, వెన్ను భాగంలో బలమైన గాయం కావడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు తెలిపారు. మృతుని కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బీరప్పస్వామి ఆలయంలో చోరీ

మానవపాడు, సెప్టెంబర్ 23 : జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలం చెన్నిపాడులో బీరప్పస్వామి ఆలయంలో చోరీ జరిగింది. ఎస్ఐ చంద్రకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. బీరప్పస్వామి ఆలయంలోని గుర్తు తెలియని వ్యక్తులు శనివారం రాత్రి వెండి ఆభరణలు, హుండీలోని నగదు ఎత్తుకెళ్లినట్లు వివరించారు. సోమవారం ఉదయం పూజలు చేసేందుకు వెళ్లినవారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎత్తుకెళ్లిన వస్తువుల విలువ రూ.18వేల వరకు ఉండొచ్చని తెలిపారు. గొల్ల చిన్న హుస్సేన్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉపాధ్యాయుడికి గాయాలు

మిడ్జిల్, సెప్టెంబరు 23: మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలంలోని మర్లాబాయితండా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కిందపడి గాయాలయ్యాయి. మండలంలోని అయ్యవారిపల్లికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు శివప్రసాద్ అయ్యవారిపల్లి నుంచి మర్లాబాయితండా పాఠశాలకు వెళ్తున్న క్రమంలో కుక్క అడ్డురావడంతో బైక్ అదుపు తప్పి కిందపడ్డాడు. వెంటనే స్థానికులు మిడ్జిల్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు.

ఆర్ఐటీఐ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మన్ననూర్, సెప్టెంబరు 23 : అమ్రాబాద్ మండలం మన్ననూరు గిరిజన పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఆర్ఐటీఐ)లో మిగిలిన సీట్లకు ఐదో విడత ప్రవేశాలకు ఈ నెల 25 నుంచి 28 వరకు నేరుగా కళాశాలలో దరఖాస్తు చేసుకొని ప్రవేశాలు పొందవచ్చునని ప్రిన్సిపాల్ లక్ష్మణ స్వామి సోమవారం తెలిపారు. ఐదో విడత ప్రవేశాలు పొందే వారు ఐటీఐ తెలంగాణ వెబ్‌సైట్‌లో ఫోన్‌నంబరుతో ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, మొదటి నాలుగు విడతల్లో రిజిస్ట్రేషన్ చేసుకుని సీట్లు రాని వారు నేరుగా ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు. అభ్యర్థులు దరఖాస్తుతో పాటుగా పదో తరగతి మెమో, కులం, ఆదాయం, ఆధార్, టీసీ, ఫొటోలను తీసుకొని రావాలని, పదో తరగతిలో వచ్చిన మార్కుల మెరిట్, రిజర్వేషన్ ప్రాతిపదికన ఖాళీగా ఉన్న కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తామని చెప్పారు. అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు సీజ్



పోలీస్‌స్టేషన్‌లో ఉంచిన ఇసుక ట్రాక్టర్లు

ఆత్మకూరు, సెప్టెంబరు 23 : ఊకచెట్టు వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను సీజ్ చేసి కేసులు నమోదు చేశామని వనపర్తి జిల్లా ఆత్మకూరు ఎస్ఐ నరేందర్ తెలిపారు. మండలంలోని రేచింతల వాగు నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నారన్న సమాచారంతో గొల్ల ప్రవీణ్, బొరెల్లి హరీష్ కుమార్, బొరెల్లి సురేష్‌ను పట్టుకుని ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించామని తెలిపారు. అలాగే చిన్న చింతకుంట మండలం అల్లిపూర్ శివారులోని ఊక చెట్టు వాగు నుంచి ఆత్మకూరు మీదుగా మహేష్ ఆత్మకూరు గాంధీ చౌరస్తా మీదుగా అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా పట్టుకొని స్టేషన్‌కు తరలించామని తెలిపారు. ఎవరైనా అక్రమంగా ఇసుక రవాణాకు పాల్పడితే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రోడ్డు నిర్మాణ పనులపై ఎమ్మెల్యే ఆరా

» ఎన్‌హెచ్‌ఏఐ అధికారులకు సిగ్నల్‌గడ్డ రోడ్డు దుస్థితిని వివరించిన అనిరుధ్‌రెడ్డి


ఎన్‌హెచ్‌ఏఐ అధికారులతో మాట్లాడుతున్న జడ్చర్ల ఎమ్మెల్యే

జడ్చర్ల, సెప్టెంబరు 23 : జడ్చర్ల మునిసిపాలిటీలోని సిగ్నల్‌గడ్డ ప్రాంతంలో ఎంపీడీవో కార్యాలయం నుంచి సాయినగర్‌కాలనీ వరకు జాతీయ రహదారి నిర్మాణం పనుల అంశంపై నేషనల్ హైవే అథారిటీ అధికారులను జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి కలిశారు. హైదరాబాద్‌లోని ఎన్‌హెచ్ఏఐ కార్యాలయంలో సోమవారం రీజనల్ హెడ్ కృష్ణప్రసాద్‌తో కలిసి సిగ్నల్‌గడ్డ వద్ద నెలకొన్న దుస్థితిని వివరించారు. రోడ్డు పరిస్థితికి సంబంధించిన ఫొటో, వీడియోలను అధికారికి చూపించారు. స్పందించిన రీజనల్ హెడ్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ రానున్న 30రోజుల్లోగా సిగ్నల్‌గడ్డ ప్రాంతంలో బీటీ రోడ్డు వేయించేలా చర్యలు తీసుకుంటా నని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డికి హామీ ఇచ్చారు.

రాజీ మార్గంలో కేసులు పరిష్కరించుకోవాలి

» ఈనెల 28న లోక్‌అదాలత్ : ఎస్పీ జానకి

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 23 : చిన్నచిన్న గొడవలతో కేసుల దాకా వెళ్లడం సరికాదని, కొద్దిసేపు క్షణికావేశాన్ని పక్కనపెట్టి ఇరువురు ఆలోచిస్తే చాలా గొడవలు పరిష్కారం అవుతాయని ఎస్పీ జానకి అన్నారు. ఈనెల 28న జాతీయ మెగా లోక్‌అదాలత్ ఉన్నదని, ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకుని రాజీమార్గంలో కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. లోక్‌అదాలత్‌ను పురస్కరించుకుని సోమవారం ఆమె తన కార్యాలయంలో డీఎస్పీలు, సీఐలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు రాజీ కాదగిన కేసులను ఇరువర్గాలను కూర్చోపెట్టి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇరువర్గాలకు కౌన్సెలింగ్ ఇవ్వాలని సూచించారు. పిటీ కేసులు, డ్రంకెన్ డ్రైవ్, ట్రాఫిక్ చలానాలు, చిన్నచిన్న గొడవలన్నింటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

భూత్పూర్‌లో దేవీ నవరాత్రి ఉత్సవ కమిటీ ఏర్పాటు


ఎన్నికైన ఉత్సవ కమిటీ నాయకులు

భూత్పూర్, సెప్టెంబరు 23 : దేవీ నవరాత్రి ఉత్సవ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం మునిసిపాలిటీ పరిధిలోని 10వ వార్డులో ఉన్న ఆంజనేయస్వామి దేవాలయంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక సమావేశానికి మునిసిపల్ చైర్మన్ బస్వరాజుగౌడ్, స్థానిక నాయకులు హాజరయ్యారు. అనంతరం కమిటీ కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లిక్కీ విజయ్‌కుమార్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా గొడుగు వెంకట్రాజు, జైదుశ్రీను, గడ్డం యాదయ్య, ప్రధాన కార్యదర్శిగా గడ్డం ఎల్లప్ప, కోశాధికారిగా రమాకాంతరావు, సాంస్కృతిక కార్యదర్శిగా బోరింగ్ నర్సిములతో పాటు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం కమిటీని మునిసిపల్ చైర్మన్ బస్వరాజుగౌడ్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణయ్యగౌడ్, అశోక్‌గౌడ్, సదానందుగౌడ్, సాయిలు, పరుశురాం, బ్రహ్మయ్యచారి, తిరుపతయ్యగౌడ్, ప్రేమ్‌కుమార్, భీమ్‌రాజ్, ఆశన్న తదితరులున్నారు.

29న గిరిజన నంగారా భేరి, లంబాడీల మహాగర్జన


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

పాలమూరు,సెప్టెంబరు 23 : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఈనెల 29న 'నంగారా భేరి, లంబాడీల మహాగర్జన' నిర్వహించనున్నట్లు లంబాడీ హక్కుల పోరాట సమితి(ఎల్‌హెచ్‌పీఎస్)జిల్లా అధ్యక్షుడు రామునాయక్ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని గిరిజన భవన్‌లో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ కళాభవన్‌లో కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని, దేశంలో 14కోట్ల లంబాడాలు మాట్లాడే భాష గోర్‌బోలీని రాజ్యాంగంలోని ఎనిమిదవ షెడ్యూల్‌లో చేర్చాలన్నారు. తండాలను రెవెన్యూ పంచాయతీలుగా ఏర్పాటు చేయాలన్నారు. రిజర్వేషన్‌ను ఆరు నుంచి పది శాతం వరకు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజునాయక్, కార్యనిర్వాహక అధ్యక్షుడు యాదగిరి, కోశాధికారి ఎస్.డాక్యా పాల్గొన్నారు.

డీటీఎఫ్ పోస్టర్ ఆవిష్కరణ


సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీటీఎఫ్ నాయకులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబరు 23 : డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 29న విద్యా సదస్సు, అభినందన సభ నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు ఆదిత్య ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీశైలం తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బీసీ స్టడీ సర్కిల్ ముందు ఉన్న జ్యోతిబా పూలే విగ్రహం వద్ద కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని క్రౌన్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న విద్యా సదస్సుకు అఖిల భారత విద్యాహక్కు వేదిక ప్రెసిడియం సభ్యులు ప్రొఫెసర్ జి.హరగోపాల్, డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎం.సోమయ్య, టి.లింగారెడ్డి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ ఎం.రాఘవచారితో పాటు పలువురు హాజరవుతారన్నారు. అదేవిధంగా విద్యారంగంలో సుదీర్ఘకాలం పాటు పనిచేసిన శ్రీశైలం పదవీ విరమణ అభినందన సభ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వామన్‌కుమార్, ప్రభాకర్, రవీందర్‌గౌడ్, వెంకటేశ్వర్లు, మల్లయ్య తదితరులున్నారు.

చలో సంక్షేమ భవన్‌కు తరలిన కేవీపీఎస్ నాయకులు

జడ్చర్ల, సెప్టెంబరు 23 : సంక్షేమ వసతిగృహాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కేవీపీఎస్ జడ్చర్ల మండల కమిటీ ఆధ్వర్యంలో చలో సంక్షేమ భవన్‌కు తరలివెళ్లారు. సోమవారం జడ్చర్ల నుంచి బయలుదేరిన వీరికి సమితి జిల్లా అధ్యక్షుడు జగన్ జెండా ఊపి ప్రారంభించారు. హాస్టల్స్‌లో విద్యార్థుల మెస్‌చార్జీలు రూ.2500కు పెంచాలని, కాస్మోటిక్స్ చార్జీలు బాలికలకు రూ.500, బాలురకు రూ.300 ఇవ్వాలని, హాస్టల్స్‌కు స్వంత భవనాలను నిర్మించాలని, మెనూ సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు లక్ష్మీదేవి, పరశురాం, నాగరాజు, శంకర్, సాయిలు, అలివేలు, భీమయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

జడ్చర్ల, సెప్టెంబరు 23 : జడ్చర్ల మునిసిపాలిటీ సిగ్నల్‌గడ్డ ప్రాంతంలోని ఎంపీడీవో కార్యాలయం నుంచి డిగ్రీ కళాశాల వరకు జాతీయ రహదారి విస్తరణ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలంటూ జడ్చర్ల సీఐ ఆదిరెడ్డికి మునిసిపల్ కౌన్సిలర్లు వినతిపత్రం అందజేశారు. పనులు నత్తనడకన సాగుతున్నాయని, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా ఆ ప్రాంతంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రజలకు ఇబ్బందులు కల్గించకుండా పనులను త్వరగా పూర్తి చేయించాలని కోరారు. కౌన్సిలర్లు ప్రశాంత్‌రెడ్డి, శశికిరణ్, ఉమాశంకర్‌గౌడ్, బుక్క మహేష్, చైతన్యగౌడ్, బీఆర్ఎస్ నాయకులు కృష్ణారెడ్డి, కొండల్, నరసింహ, నర్సిములు, వెంకటేశ్, నరసింహయాదవ్ ఉన్నారు.

అర్హులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలి

పాలమూరు, సెప్టెంబరు 23 : సర్వే నెంబర్ 523లో పట్టా సర్టిఫికెట్లు అప్పగించిన వారికి డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని టీపీజేఏసీ, టీఎఫ్‌టీయూ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్‌కు టీపీజేఏసీ, టీఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సర్వే నెంబర్ 523లో పట్టా సర్టిఫికెట్స్ కలిగిన వారి నుంచి 2018లో అర్బన్ తహసీల్దార్ కార్యాలయం నుంచి స్వాధీనం చేసుకున్నారు. విచారణ చేసి డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని అధికారులు హామీ ఇచ్చి నేటికీ అమలు చేయలేదన్నారు. అధికారుల హామీని నమ్మి పట్టాదారులు తమ సర్టిఫికెట్లను తహసీల్‌లో అందించారన్నారు. 887 మందిని అర్హులుగా గుర్తించిన అధికారులు నేటికీ ఇళ్లు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా లబ్ధిదారులకు డబుల్ ఇళ్లు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో ఖలీల్, పి.విజయ్‌కుమార్, పి.యాదగిరి, జి.గట్టన్న, జలాల్‌పాషా ఉన్నారు.

ఎక్కడి సమస్యలు అక్కడే పరిష్కరించాలి

» కలెక్టర్ విజయేందిర బోయి
» వచ్చే సోమవారం నుంచి మండల కేంద్రాల్లో ప్రజావాణి
» ఇప్పటివరకు స్వీకరించిన వాటిలో తీసుకున్న చర్యలపై నివేదికలు సమర్పించాలని అధికారులకు ఆదేశం


ఫిర్యాదుదారుడితో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్(కలెక్టరేట్), సెప్టెంబరు 23 : ఎక్కడి సమస్యలు అక్కడే పరిష్కరించాలన్న ఉద్దేశంతో వచ్చే సోమవారం నుంచి మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ విజయేందిరబోయి తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆమె సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలో ప్రజల నుంచి 72 ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదుల స్వీకరణ అనంతరం ఆమె జిల్లా, మండల స్థాయి అధికారులతో మాట్లాడారు. జిల్లా స్థాయిలో మాదిరిగానే ప్రతీ సోమవారం ఉదయం 10:30 గంటలకు మండల కేంద్రాల్లోని తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమం ప్రాంభమవుతుందని, కార్యక్రమానికి మండల స్థాయి అధికారులందరు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు సైతం హాజరు కావాలని ఆమె ఆదేశించారు. మండల స్థాయిలో ఫిర్యాదులు పరిష్కారం కాకపోతే 15 రోజుల తర్వాత కలెక్టరేట్‌కు రావాలని కోరారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులన్నింటిని వారం రోజుల్లో పరిష్కారం చేయాలని అధికారులకు సూచించారు. ఇప్పటివరకు స్వీకరించిన వాటిలో తీసుకున్న చర్యలపై నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, ఆర్డీవో నవీన్, జిల్లా అధికారులు ప్రజావాణి కార్యక్రమానికి హాజరయ్యారు.

రోడ్డు మార్గాన్ని పునరుద్ధరించండి..

కోయిల్‌కొండ మండలం మల్కాపూర్ గ్రామ రైతుల పొలాల్లోకి వెళ్లేందుకు 2018లో అప్పుడున్న కలెక్టర్ ఆదేశాలతో రోడ్డును వేశారు. అయితే ఇటీవల వర్దన్నపల్లి తండా రైతులు కొంతమంది రోడ్డును ధ్వంసం చేశారని దీనిపై సంబంధిత అధికారులు విచారణ చేసి రిపోర్టులు అందించినప్పటికి రోడ్డు పునరుద్ధరణ జరగలేదని దీంతో రైతుల మందరం ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని మల్కాపూర్ గ్రామానికి చెందిన రైతులు ప్రజావాణిలో వినతిని సమర్పించారు.

భూ ఆక్రమణ చేస్తున్నారు.. చర్యలు తీసుకోండి

తాత, ముత్తాతల కాలం నాటినుంచి గండీడు మండల శివారులోని సర్వే నెంబర్ 46, 47, 55లో సుమారు 30 ఎకరాల సాగు భూమి ఉంది. వంశపారంగా నాకు 60 కుంటల భూమి వచ్చింది. మా పాలేరు తనకు వచ్చిన భూమిని ఇతరులకు అమ్ముకున్నాడు. పాలేరు నుంచి భూమిని కొన్న వ్యక్తి నా భూమిని ఆక్రమణ చేస్తూ సాగు చేస్తున్న భూమి తనకు వస్తుందని కొంతకాలంగా ఇబ్బందులు పెడుతున్నాడని గండీడ్ మండల కేంద్రానికి చెందిన మల్లోజీ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. తనపు ఆక్రమణ చేస్తున్న సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహిద్దాం

» మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్
» ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి బాలుర జూనియర్ కళాశాల మైదానం పరిశీలన


ఉత్సవాల మైదానాన్ని పరిశీలిస్తున్న మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, ఉత్సవ కమిటీ సభ్యులు

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 23 : దసరా ఉత్సవాలను ఈ ఏడాది ఘనంగా నిర్వహించేందుకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నామని మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ అన్నారు. సోమవారం దసరా ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి ఉత్సవాలు నిర్వహించే బాలుర జూనియర్ కళాశాల మైదానాన్ని ఆయన పరిశీలించారు. రావణ దహనం చేసే ప్రాంతం, బాణాసంచా కాల్చే ప్రదేశాలను పరిశీలించారు. ఉత్సవాలు తిలకించేందుకు వేలాదిగా ప్రజలు తరలివచ్చే అవకాశం ఉన్నందున మైదానానికి ఉన్న మూడు వైపులా రహదారులను తెరిచి ఉంచుతామన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పోలీస్‌శాఖ అన్నిరకాల చర్యలు తీసుకుంటుందన్నారు. రాష్ట్రంలో ప్రజాపాలన ఏర్పడిన తరువాత మొదటిసారిగా దసరా ఉత్సవాలు వస్తున్నందున ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, అధికార యంత్రాంగం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ధ్వజదారిగా ఉత్సవ కమిటీ సభ్యులు, కౌన్సిలర్ అంజయ్య వ్యవహరిస్తున్నారని, దసరా రోజు ఆర్యసమాజ్ నుంచి బాలుర జూనియర్ కళాశాల మైదానం వరకు భారీ ఊరేగింపు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఉత్సవ సమితి సభ్యులు డా.మురళీధర్‌రావు, చంద్రయ్య, బురుజు రాజేందర్‌రెడ్డి, లక్ష్మణ్, చంద్రకుమార్‌గౌడ్, వసంతం వెంకటేశ్, సురేందర్‌రెడ్డి, మాల్యాద్రిరెడ్డి ఉన్నారు.

పదోన్నతుల క్యాలెండర్‌ను అమలు చేస్తాం

» టీపీఆర్టీయూ వ్యవస్థాపకుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి


ఉపాధ్యాయులతో సంఘం సభ్యత్వం చేయిస్తున్న హర్షవరన్‌రెడ్డి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబరు 23 : ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్ రూపొందించి పదోన్నతుల క్యాలెండర్‌ను అమలు చేస్తామని టీపీఆర్టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు, పీసీసీ అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం మహమ్మదాబాద్ బాలుర ఉన్నత పాఠశాలలో పలువురు ఉపాధ్యాయులతో ఆయన సంఘం సభ్యత్వం చేయించారు. అనంతరం మాట్లాడుతూ ఉపాధ్యాయ సర్వీస్ రూల్స్ రూపొందించడానికి నిపుణులతో కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ప్రతీ వేసవి సెలవుల్లో బదిలీలు, పదోన్నతుల కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యా సంవత్సరానికి ఆటంకం కల్గకుండా సజావుగా పాఠశాలలు సజావుగా నడిపేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రాంచందర్‌రాథోడ్, జిల్లా అధ్యక్షుడు శ్యాంబాబు, ప్రధాన కార్యదర్శి రమాకాంత్, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగిరెడ్డి తదితరులున్నారు.

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

» కార్మిక సంఘాల డిమాండ్
» కేంద్రం విధానాలను నిరసిస్తూ బ్లాక్‌డే


జడ్చర్లలో బ్లాక్ డే సందర్భంగా మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తెలుగుసత్తయ్య

జడ్చర్ల, సెప్టెంబరు 23 : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో బ్లాక్‌డే నిర్వహించినట్లు యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి తెలుగు సత్తయ్య అన్నారు. జడ్చర్ల మునిసిపాలిటీలోని అంబేడ్కర్ చౌరస్తాలో జ్యోతిరావుపూలే విగ్రహం వద్ద బ్లాక్‌డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న ఎన్‌డీఏ ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా కార్మికవర్గం, రైతాంగం ఆధ్వర్యంలో సెప్టెంబరు 23న బ్లాక్‌డే పాటిస్తున్నట్లు వివరించారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ఉద్యోగభద్రత కల్పించాలని, కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఆకుల వెంకటేశ్, కృష్ణ, సాగర్, చెన్నకేశవులు, నర్సిములు, అరుణ్‌కుమార్, యాదమ్మ, దేవమ్మ, ఇందిర, చిన్నమ్మ, లక్ష్మమ్మ, ఈశ్వరమ్మ తదితరులున్నారు.


తెలంగాణ చౌరస్తాలో బ్లాక్‌డేను నిర్వహిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

జిల్లా కేంద్రంలో...

పాలమూరు : జిల్లా కేంద్రంలో సీఐటీయూ, టీఎన్‌టీయూసీ కార్మిక సంఘాల నాయకులు సోమవారం బ్లాక్‌డే పాటించారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించి తెలంగాణ చౌరస్తాలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. నరేంద్రమోదీ ప్రభుత్వం లేబర్ కోడ్ అమలు చేయడానికి పూనుకుందన్నారు. కార్మికులందరికి సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి, టీఎన్‌టీయూసీ జిల్లా కార్యదర్శి రాములు, బి.చంద్రకాంత్, రాములు తదితరులున్నారు.

కార్మికులు వైద్య పరీక్షలు చేయించుకోవాలి

» ఎంపీడీవో జయరాములు


నవాబ్‌పేట పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రఫీక్

నవాబ్‌పేట/మూసాపేట, సెప్టెంబరు 23 : గ్రామ పంచాయతీల్లో పనిచేసే కార్మికులు ప్రతీ ఒక్కరు వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఎంపీడీవో జయరాములు అన్నారు. సోమవారం నవాబ్‌పేట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పంచాయతీ కార్మికులకు వైద్య పరీక్షలు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ కార్మికుడు ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో ఎంపీవో భద్రునాయక్, ఏపీవో జ్యోతి, డాక్టర్ తేజశ్రీ, వైద్య సిబ్బంది, ఆశలు నిర్మల, లక్ష్మీ, మాధవి తదితరులున్నారు.

అదేవిధంగా, మూసాపేట మండలంలోని వివిధ గ్రామాల్లో పనిచేస్తున్న మల్టీపర్పస్ పారిశుద్ధ్య సిబ్బంది, కార్మికులకు వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. సీజన్‌లో ప్రబలుతున్న వ్యాధుల పట్ల ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్య సిబ్బంది తగు సూచనలు, సలహాలు చేశారు. కార్యక్రమంలో ఎంపీ డీవో కృష్ణయ్య, ఎంపీవో అనురాధ, వైద్యులు డా.రమాదేవి, డా.సంతోష్, డా.జై పాల్ పంచాయతీ కార్యదర్శులు సురేష్‌కుమార్, మహేందర్, సతీష్‌రెడ్డి, రాఘ వేందర్, సంతోషీ, మాధవి, అఖిల్, కార్తీక్ తదితరులున్నారు.

భారీ వర్షానికి పాక్షికంగా కూలిన గోపన్నపల్లి రోడ్డు కల్వర్టు


వర్షానికి కూలిన గోపన్నపల్లి రోడ్డు కల్వర్టును పరిశీలిస్తున్న ఎంపీడీవో, అధికారులు

భూత్పూర్, సెప్టెంబరు 23 : భారీ వర్షానికి రోడ్డు కల్వర్టు కూలిపోవడంతో రెండు గ్రామాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వివరాల్లోకి వెళ్తే మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలంలోని పోతులమడుగు గ్రామ పంచాయతీ పరిధిలో గోపన్నపల్లి గ్రామం ఉంది. ఈ గ్రామానికి వెళ్లే దారిలో పెద్ద వాగు ఉంది. అయితే 15 సంవత్సరాల క్రితం వాగు దాటడానికి రోడ్డు కల్వర్టు ఏర్పాటు చేశారు. నెలరోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు వాగులో భారీ మొత్తంలో వర్షపు నీరు పారుతుండడంతో సోమవారం కల్వర్టు పాక్షికంగా కూలిపోయింది. విషయం తెలుసుకున్న ఎంపీడీవో ప్రభాకర్‌చారి, ఇరిగేషన్ శాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని ఎక్స్‌కవేటర్ సహాయంతో తాత్కాలికంగా మరమ్మతు పనులు చేపట్టారు. కల్వర్టు కూలిన విషయం గురించి జిల్లా ఉన్నతాధికారులకు సమాచారం అందించినట్లు ఎంపీడీవో ప్రభాకర్‌చారి తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ ఏఈ స్వామి, మాజీ ఉప సర్పంచ్ కోట్ల కిష్టప్ప, పంచాయతీ కార్యదర్శి కృష్ణకుమారి, పోతులమడుగు గ్రామస్థులు తదితరులున్నారు.

చైల్డ్‌కేర్ సెంటర్ నిర్వాహకుల ఔదార్యం

» జనరల్ ఆసుపత్రిలోని పిల్లల విభాగానికి 10 ఊయలల వితరణ

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం) సెప్టెంబరు 23 : పట్టణంలోని లిటిల్ బర్డ్స్ చైల్డ్‌కేర్ సెంటర్ నిర్వాహకులు తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. జనరల్ ఆసుపత్రిలోని చిన్నపిల్లల విభాగానికి 10 ఊయలలను దానం చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సంపత్‌కుమార్ సింగ్ చైల్డ్‌కేర్ సెంటర్ నిర్వాహకులు సవిత, అడ్వకేట్ లక్ష్మీకాంతరావులను అభినందించారు. కార్యక్రమంలో చిన్నపిల్లల విభాగాధిపతి డా.సురేష్, గైనిక్ హెచ్‌వోడీ డా.సంగీతషా, డా.లక్ష్మిపద్మప్రియ, డా.స్ఫూర్తిరెడ్డి, డా.ఆశాజ్యోతి, చిన్నపిల్లల విభాగం డాక్టర్లు పాల్గొన్నారు.

రోడ్డు అండర్ బ్రిడ్జి పనుల పరిశీలన

జడ్చర్ల, సెప్టెంబరు 23 : జడ్చర్ల మునిసిపాలిటీలోని రైల్వే గేటు వద్ద నిర్మిస్తున్న రోడ్డు అండర్ బ్రిడ్జి పనుల్లో భాగంగా గాంధీచౌరస్తాలో చేపడుతున్న నిర్మాణ పనులను సోమవారం మునిసిపల్ కమిషనర్ రాజయ్య, కౌన్సిలర్లు పరిశీలించారు. చౌరస్తా నుంచి హనుమాన్ దేవాలయానికి వెళ్లే దారిలోని కమాన్ వద్ద మురుగుకాలువ నిర్మాణం, రోడ్డు పనులను వారు పరిశీలించారు.

ఉచిత గ్యాస్ పత్రాలు రానివారు ఉంటే సరి చేసుకోవాలి

దేవరకద్ర, సెప్టెంబరు 23 : గ్యాస్, ఉచిత కరెంటు బిల్ కోసం దరఖాస్తు చేసుకొని పత్రాలు రాని వారు ఉంటే సరి చేసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాస్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరు గ్యారెంటీల పథకంలో దరఖాస్తు చేసుకున్న వారికి సంబంధిత పత్రాలు రానివారు ఉంటే ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటుచేసిన కౌంటర్‌లో సరి చేసుకోవాలని సూచించారు.

దోమల నివారణకు చర్యలు

కోయిలకొండ, సెప్టెంబరు 23 : గ్రామాల్లో దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో కాళప్ప సూచించారు. సోమవారం ఆయన పంచాయతీ సిబ్బందితో మాట్లాడుతూ ఫాగింగ్ మిషన్లను మరమ్మతు చేసి గ్రామాలకు పంపిస్తామని తెలిపారు. పంచాయతీల్లోని ప్రతీ వార్డులో ఫాగింగ్ చేయాలని సూచించారు. దీంతో పాటు, మురుగునీరు నిల్వకుండా చర్యలు తీసుకొని బ్లీచింగ్ పౌడర్, సున్నం చల్లించాలని ఆయన తెలిపారు.

వరి పంటకు వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలి

మూసాపేట, సెప్టెంబరు 23 : ప్రసుత్త సీజన్‌లో వరి పంట పైరుకు తెగుళ్లు, వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తగా నివారణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి అనిల్‌కుమార్ రైతులను కోరారు. మండలంలోని వేముల గ్రామ శివారులో వరిపంట పొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వరిలో కాండం తొలుచు పురుగు, సుడిదోమ, అగ్గి తెగులు, బ్యాక్టీరియా, ఆకు ఎండు తెగులను గమనించి వాటి సస్యరక్షణ చర్యలకు పలు సూచనలు చేశారు. వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు ఉన్నారు.

మునిసిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

జడ్చర్ల, సెప్టెంబరు 23 : మునిసిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలంటూ సోమవారం మునిసిపల్ కమిషనర్ రాజయ్యకు మునిసిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు వినతిపత్రం అందించారు. ఈనెల 25న ఛలో కలెక్టరేట్ వద్ద ధర్నా, అక్టోబరు 8న హైదరాబాద్‌లోని సీడీఎంఏ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టనున్నట్లు యూనియన్ నాయకులు కృష్ణ, కేశవులు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తెలుగుసత్తయ్య, అరుణ్‌కుమార్‌లతో పాటు కార్మికులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ బాధ్యతను ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఇవ్వాలి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబరు 23 : జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ బాధ్యతలను ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం యాజమాన్య పాఠశాలల్లో పనిచేసే స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుడికి ఇవ్వాలని ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్, నాయకులు వెంకట్‌రాములు, ఆంజనేయులు, వెంకటస్వామి తదితరులు డిమాండ్ చేశారు. జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా జడ్పీ ఉపాధ్యాయులకు బాధ్యతను కట్టబెట్టారని వారు ఆరోపించారు. ఈ మేరకు సోమవారం వారు కలెక్టర్ విజయేందిరబోయిని కలిసి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. డీఈవో రాజకీయ వత్తిడికి తలొగ్గి పంచాయతీ టీచర్‌కు బాధ్యతను అప్పగించారని పేర్కొన్నారు.

విద్యార్థులు వైద్య రంగంపై దృష్టి పెట్టాలి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబరు 23 : విద్యార్థులు వైద్య రంగంలో చోటు చేసుకుంటున్న అభివృద్ధిని, నూతన వైద్య విధానాలపై దృష్టి పెట్టాలని ఎన్టీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వి.రాజేంద్రప్రసాద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్‌వీఎస్ మెడికల్ కళాశాల, ఆసుపత్రిలో నిర్వహిస్తున్న మెడికల్ ఎగ్జిబిషన్‌ను ఎన్టీఆర్ మహిళ డిగ్రీ కళాశాల విద్యార్థులు సోమవారం సందర్శించారు. అక్కడ ఉన్న వివిధ రకాల ఆరోగ్యకరమైన విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రిన్సిపాల్ రాజేంద్ర సింగ్ మాట్లాడారు. కార్యక్రమంలో జంతుశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ప్రవీణ్‌కుమార్, అధ్యాపకులు డా.శివప్రసాద్, వెంకటరమణమూర్తి, ఆదిబాతాజ్, సోనాలి, మల్లేష్ తదితరులున్నారు.

డెవలప్‌మెంట్ లైఫ్‌స్కిల్స్‌పై అవగాహన

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబరు 23 : విద్యార్థులకు డెవలప్‌మెంట్ లైఫ్ స్కిల్స్‌పై అవగాహన ఉండాలని ఎస్‌వీఎస్ మెడికల్ కళాశాల అధ్యాపకురాలు, రేడియాలజిస్ట్ డాక్టర్ దేవిక బాదామి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని జయప్రకాష్ ఇంజనీరింగ్ కళాశాలలో పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌పై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆమె హాజరై, మాట్లాడారు. విద్యార్థులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగాధిపతి డా.గురురాఘవేంద్ర, కోటల సందీప్, జమున, రాధిక, రాకేష్, స్వాతి, మహేష్ తదితరులున్నారు.

టీపీఆర్టీయూ మండల అధ్యక్షుడిగా జయసూర్యనారాయణ

మహమ్మదాబాద్, సెప్టెంబరు 23 : టీపీఆర్టీయూ మండల అధ్యక్షుడిగా జమల్‌పూర్ జయసూర్యనారాయణను ఎన్నుకున్నారు. సోమవారం మండల కేంద్రంలో జరిగిన టీపీఆర్టీయూ సమావేశంలో మండల కమిటీని ఎనున్నకున్నారు. అధ్యక్షుడిగా జయసూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా అన్నపూర్ణ, ఉపాధ్యక్షుడిగా విశాల్‌లను ఎన్నుకున్నారు. అదేవిధంగా గండీడ్ మండల అధ్యక్షుడిగా జి.మహిపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా డి.సంజీవరెడ్డిలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్యాంబాబు, ప్రధాన కార్యదర్శి రమాకాంత్, జిల్లా, మండల బాధ్యులు పాల్గొన్నారు.

బాదేపల్లి మార్కెట్‌లో జోరందుకున్న మొక్కజొన్న కొనుగోళ్లు

జడ్చర్ల, సెప్టెంబరు 23 : బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌కు సోమవారం నాలుగు వేల క్వింటాళ్ల మొక్కజొన్నను విక్రయించేందుకు రైతులు తీసుకువచ్చారు. గడిచిన వారం రోజులుగా మార్కెట్‌లో మొక్కజొన్న క్రయ, విక్రయాలు జోరందుకున్నాయి. సోమవారం మొక్కజొన్న క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.2,569, కనిష్ఠంగా రూ.1,203 పలికింది. ప్రస్తుత ధరలతో రైతులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.